క్లుప్తంగా

10న గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురంలో ఈ నెల 10, 11వ తేదీలలో గంగమ్మ తిరునాల నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11న ఆదివారం ఎద్దుల బండ లాగుడు పోటీలు, గుండు ఎత్తడం, ట్రాక్టర్ రివర్స్‌లో నడిపడం పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత న్యాయ సేవలు


మాట్లాడుతున్న ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి


రాజుపాళెం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) ద్వారా అందరికి అందుబాటులో ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి అన్నారు. మండలంలోని కుమ్మరపల్లె గ్రామంలో బుధవారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో రెండవ అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టం తదితర అంశాలను వివరించారు. అలాగే వివాదాలను సామరస్యంగా పరిష్కరించడం కోసం లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ప్రొద్దుటూరు డీఎస్పీ భావన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండేందుకు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ, న్యాయవాదులు లక్ష్మీదేవి, మోహతాబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రొద్దుటూరు : జీవో 77ను రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున కోరారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రొద్దుటూరులోని ఎస్ఆర్‌ఐటీఐ సెట్ పరీక్ష కేంద్రం వద్ద జీవో 77ను రద్దు చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన జీవో నంబరు 77 ప్రైవేటు కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలని అనుకునే పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 77 ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తావించారని గుర్తుచేశారు. అయితే ఇప్పటికి ప్రభుత్వం వచ్చి 327 రోజులైందని, ఇప్పటికి ఈ జీవో గురించి పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరణ్ కుమార్, నగర కార్యదర్శి శివ నారాయణ, శ్రవణ్ పాల్గొన్నారు.

పరామర్శ


సుబ్బరాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక దొరసానిపల్లెలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బరాయుడును బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి పరామర్శించారు. సుబ్బరాయుడు ఈ నెల 4వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో రాచమల్లు ఆయన ఇంటికి వెళ్లి సుబ్బరాయుడు పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని రాచమల్లు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దొరసానిపల్లె ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ గంగయ్య

ప్రొద్దుటూరు : తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల నమోదు అధికారి ఆధ్వర్యంలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ గంగయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారి ఓటు నమోదు, మృతిచెందిన ఓటరు తొలగింపు విషయంపై తెలిపామన్నారు. డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ సహాయకులు పాల్గొన్నారు.

వైభవం.. ఆరాధనోత్సవం

- చిన్నమఠంలో జేజినాయన ఉత్సవాలు
- భారీగా పాల్గొన్న భక్తులు


ఈశ్వరీదేవిని ఊరేగిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : కందిమల్లాయపల్లెలోని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విశ్వకర్మ పరమేశ్వరులు, శ్రీ ఈశ్వరీదేవికి పంచామృతాభిషేకాలు, బిల్వదళార్చన పూజలు చేశారు. అనంతరం జరిగిన గుడి ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. ప్రకాశం జిల్లా చీరాలపేరాలకు చెందిన తుర్లపాటి సాంబశివరావు, పద్మావతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్పం, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భక్తగాన లహరి, వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీ ఈశ్వరీదేవి ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వాసుదేవాపురానికి చెందిన మూలింటి చిన్న నాగిరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఆదిబ్రహ్మయ్యాచారి, కె.నాగభూషణచారి, కె.నాగవీరాచారి, కె.జనార్దనాచారి, హిందూపురానికి చెందిన కె.క్రిష్ణమాచారి, ధర్మవరానికి చెందిన యస్.శంకరాచారి సహకారంతో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పెద్దమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న తర్వాత భక్తులు.. స్వామి మనువరాలైన శ్రీఈశ్వరీదేవిని చిన్నమఠంలో దర్శించుకుని తరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేపట్టారు.

అచలానందస్వామి ఆశ్రమంలో..

బ్రహ్మంగారిమఠం మండల పరిధి తోట్లపల్లిలోని అచలానందస్వామి ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ, కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 4 నుంచి 9 వరకు ఆరు రోజులపాటు ఉత్సవాలు చేపడుతున్నారు. బుధవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు, విశ్వశాంతి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను సద్గురు అచలానందస్వామి ఆశీస్సులతో పీఠాధిపతులు శ్రీ విరజానందస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములను దర్శించుకుని తరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వద్ద గల పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమ్మె ఫలితంగా రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.75 వేలు చెల్లిస్తామని, ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలను పెంచుతామని తదితర అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకుని నేటికి ఏడాదిన్నర కావస్తున్నా ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీవోలను జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు, ఎక్స్‌గ్రేషియాలతో పాటు కనీసం మట్టి ఖర్చులు కూడా చెల్లించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, దేవమ్మ, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి శివకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై సంబరాలు

బద్వేలు అర్బన్ : పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేసి కొందరు ఉగ్రవాదులను తుదముట్టించడంపై బుధవారం పట్టణంలో కొందరు యువకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ జెండాలు చేతపట్టి పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి భారత్‌మాతాకీ జై జయహో ఇండియన్ ఆర్మీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భూమిరెడ్డి వెంకటేష్, యర్రంరెడ్డి, రవిశంకర్ మాట్లాడుతూ అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఉగ్రవాద ముఠాలను తుదముట్టించాలని కోరారు. కశ్మీర్‌లోని పహల్గామ్ దాడిలో 28 మందిని అత్యంత కిరాతకంగా పాక్ ఉగ్రవాదులు హతమార్చడం హేయమైన చర్య అన్నారు. ఎంతో మంది మహిళల ఆక్రందనకు కారణమైందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ని ప్రతీ భారతీయుడు స్వాగతిస్తున్నారని తెలిపారు. అనిల్‌కుమార్‌రాజు, వి.వి.రమణ, సుబ్బరాయుడుయాదవ్, ఆవులకిశోర్, వెంకటయ్య, సంద్రా శ్రీను, నరసింహ, శివారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో కడప ఉక్కు సాదిద్దాం


అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు : అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో కడప ఉక్కును సాధించుకుందామని ప్రొద్దుటూరు డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మేరి కుమార్, కార్యదర్శి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరులోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన మహా వీరుడు అల్లూరి అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా కడప ఉక్కు కోసం పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఉక్కు పరిశ్రమను నెలకొల్పేవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రమేష్, రవితేజ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండరాదు


మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నమ్మ

బి.కోడూరు : మండలంలో ప్రస్తుతం నెలకొన్న వేసవి దృష్ట్యా కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తరాదని స్థానిక సర్పంచ్‌లు, పంచాయ తీ కార్యదర్శులు తాగునీటి సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో స్థానిక పంచాయతీలకు నిధులు లేకపోవడం వలన మౌలిక వసతుల కల్పనలో చాలా వెనుకబడ్డామని, గ్రామాల్లో రోడ్లు తాగునీరు సరిగా లేవని, విద్యుత్ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఉపాధి పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని మండల సమావేశంలో తీర్మానం చేయాలని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండవేడిమి తాళలేక..

రాజుపాళెం : భానుడి ప్రతాపానికి ప్రజలే కాదు.. జంతువులు కూడా విలవిలలాడి పోతున్నాయి. ఎండలు తగ్గకపోవడంతో బయటకు వెళ్లలేక ఆందోళన చెందుతున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు యువకులు జలకాలాడటం, రైతులు పశువులను, మేకలను, పొట్టేళ్లను వేసవి తాపాన్ని తీర్చేందుకు కుందూనదిలోకి తోలుకు పోతున్నారు. మరికొంతమంది ఇంటివద్దనే పశువులకు మధ్యాహ్న సమయంలో బిందెలతో నీటిని పోసి చల్లబరుస్తున్నారు. ఏదిఏమైనా ఎండలు తగ్గేవరకు చాలా జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.


ఎండవేడిమికి చెట్టు కిందకు చేరిన గొర్రెలు, మేకలు


కుందూనదిలో నీరు తాగుతున్న మేకలు, గొర్రెలు

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లో వణుకు

ఖాజీపేట : ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయంతో పాకిస్తాన్‌లో వణుకు పుట్టిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. దుంపలగట్టులో బుధవారం జాతీయ జెండాకు వందనం చేసి స్థానికులకు సీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గామ్ దాడిలో 28 మందిని అత్యంత కిరాతకంగా పాక్ ఉగ్రవాదులు హతమార్చడం హేయమైన చర్య అన్నారు. ఎంతో మంది మహిళల ఆక్రందనకు కారణమైందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ని ప్రతీ భారతీయుడు స్వాగతిస్తున్నారని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


ఎస్ఐ వెంకటసురేష్

బి.కోడూరు : శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తామని ఎస్ఐగా పి.వెంకటసురేష్ తెలిపారు. బి.కోడూరు మండల ఎస్ఐగా పి.వెంకటసురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రొద్దుటూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై బి.కోడూరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని, మండలంలో ఏవైనా సంఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వాహనాల తనిఖీ


వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసులు

కాశినాయన : మండలంలోని ఓబులాపురం సర్కిల్ వద్ద బుధవారం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, ఆర్‌సీ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, ఆర్‌సీ ఉండాలని సూచించారు. కలసపాడు, కాశినాయన మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం


సివిల్స్ ర్యాంకర్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 151వ ర్యాంకు సాధించిన బి.కోడూరు మండలం సిద్దుగారిపల్లె గ్రామ నివాసి నేలటూరు శ్రీకాంత్‌రెడ్డిని బుధవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీగోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి ఐఏఎస్‌కు ఎంపిక కావడంలో ఎంతో కృషి దాగి ఉందని, యువత శ్రీకాంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. అలాగే పేదలకు సేవ చేసే అవకాశం కలగడం అదృష్టంగా భావించాలని కోరారు. అలాగే శ్రీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు నేలటూరు సుబ్బారెడ్డి, సావిత్రిలను కూడా అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు రఘురామిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంట పరిశీలన

అట్లూరు : బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం పుట్టాయపల్లె గ్రామంలో బుధవారం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ మండల వ్యవసాయాధికారి కె.చంద్రమోహన్‌రెడ్డితో కలిసి పత్తిపంటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారంతో నవధాన్య విత్తనాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వేసవిలో సాగు చేసిన పెసర, మినుము, పత్తిపంటలను ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పత్తిపంటకు పారావిల్ట్ (కుళ్లు రోగం) ఉన్నట్లు గమనించడం జరిగిందని, దీని నివారణకు 13.0.45 అనే ఎరువును లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు.

శేషవాహనంపై అగస్త్యేశ్వరుడు


శేషవాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అగస్త్యేశ్వరుడు శేష వాహనంపై ఊరేగారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి శేషవాహనంపై కొలువుదీర్చారు. విశేష పూజాకార్యక్రమాల అనంతరం పురవీధుల్లో శివనామ స్మరణలతో వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

గోపవరం : మండలంలోని రాచాయపేటలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం, చిన్నపిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అభయాంజనేయస్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోకపావని.. పాహిమాం


ప్రొద్దుటూరు కల్చరల్: వజ్రపు చీరకిరీట ధారణలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి


కలసపాడు: అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం వాసవాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని మహాప్రాకార ప్రదక్షిణం, పుణ్యాహవాచనం, సప్తశతీ పారాయణం, అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి గజమాలలతో సుందరంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమం, చండీహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిగా పట్టువస్త్రాలు, హోమద్రవ్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అమ్మవారి మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలు, మంగళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అమ్మవారి మూలవిరాట్‌ను వజ్రపుచీరె, కిరీటంతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగిందది. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు అమ్మవారికి సామూహికంగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో అమ్మవారిని అర్చించి తమను కాపాడమని భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. కార్యకమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలసపాడు : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిమాత జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. ఉదయం 10-30 గంటలకు గణపతి పూజ, నగరేశ్వరస్వామి, వాసవిమాతలకు అభిషేకాలు, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6-30 గంటలకు ఆర్యవైశ్య మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, పూజలు, భజనలు, రథోత్సవం, పవళింపుసేవర, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టిసుదర్శన్, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సభా భవనంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊహించని ఘటనలు ఎక్కడైనా జరిగితే వెంటనే ఆయా శాఖల సిబ్బంది స్పందించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అలాగే ఆయా శాఖల పరిధిలో ఆయా మండలాలలో ఇదే అంశాలపై సిబ్బందికి సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో బద్వేలు, మైదుకూరు మున్సిపల్ కమిషనర్లు వి.వి.నరసింహారెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, విద్యుత్‌శాఖ ఈఈ భరణికృష్ణ, ఏడీఈలు కుళాయప్ప, రామభద్రయ్య, రవిచంద్రశేఖర్, ఎంఈఓ చెన్నయ్య, బద్వేలు, పోరుమామిళ్ల ఫైర్ ఆఫీసర్లు ఎం.చంద్రుడు, ఎస్.నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

సామాజిక సేవకే నజీరుల్లా షా దర్గా ఆస్తులు


మాట్లాడుతున్న ఇనాయతుల్లా, దాదాపీర్

ప్రొద్దుటూరు కల్చరల్ : హజరత్ నజీరుల్లాషా దర్గా ఆస్తులు సామాజిక సేవకే ఉపయోగించాలని ఆనాటి స్థల దాతలు పేర్కొన్నారని దర్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇనాయతుల్లా, న్యాయవాది దాదాపీర్ పేర్కొన్నారు. స్థానిక నజీరుల్లాషా కల్యాణ మండపంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నజీరుల్లాషా ఆకాంక్ష మేరకు 1976లో ఒక కమిటీని ఏర్పాటు చేసి దర్గా ఆస్తులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రార్థనల కోసం మసీదు, షాదీఖానా నిర్మించామన్నారు. కొంతమంది ఆయన శిష్యులు దర్గా ఆస్తులలో తమకు హక్కు ఉందని కోర్టుకు వెళితే కోర్టు వారి పిటీషన్‌ను తిరస్కరించిందని తెలిపారు. దర్గా ఆస్తులు రాజకీయ నాయకుల జోక్యంతో అన్యాక్రాంత అవుతున్నాయని దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దర్గా కమిటీ కోశాధికారి నూరుల్లా, జాయింట్ సెక్రటరి ఆర్టీసీ బాబ, సభ్యులు బొల్లవరం బాషా, షకీల్ అహ్మద్, అయూబ్, జిలానిబాషా, షామీర్ పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన


జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి


అట్లూరు : విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న గ్రంథాలయాధికారి

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం 9వ రోజు 25 మంది విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుకునే విద్యార్థులు రోజు రోజుకు విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. చదువు తర్వాత ఉద్యోగ అన్వేషణలో జనరల్ నాలెడ్జ్ ఎంతోగానే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం ఈ తరగతుల్లో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల చేత పుస్తక పఠనం, నీతి కథలు చదివింపజేసినట్లు ఆయన తెలిపారు. అలాగే విజ్ఞానంతో పాటు వ్యాయామం గురించి తెలియజేశారు.